# బాబోయ్...

సృజనప్రియ మంత్లీ.. వరల్డ్ కప్ ప్రత్యేక సంచిక



చాలా కాలం తరువాత ఆఫీసు పనిమీద 'చీరాల' వచ్చిన భైరవమూర్తికి ఆ ఊరంతా కొత్తగా కనిపిస్తోంది. ఇరుకు రోడ్లన్నీ వెడల్పు చేయబడ్డాయి, డ్రైనేజి సిస్టం బాగుపడి దోమలు దూరమయ్యాయి. ఆక్రమిత దుకాణాలన్నీ తొలగించడంతో ఆ ప్రాంతమంతా చూడ్డానికి తీరువుగా కనిపిస్తోంది. కొత్తగా మరిన్ని వీధిలైట్లు కూడా వేయడంతో ఒక్కసారి చీరాల పట్టణం రూపురేఖలు మారిపోయి సర్వాంగ సుందరంగా తయారయింది.

భైరవమూర్తికి ఒక్కసారి 'ఉద్ధండప్ప' గుర్తుకురావడంతో ఉలిక్కిపడ్డాడు. అతని జ్ఞాపకాలు ఈనాటికీ తనని వెంటాడి మనశ్శాంతి లేకుండా చేస్తూవుంటాయి.

ఉద్ధండప్ప అంటే అప్పటి తన బాస్‌తో పాటు ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలవారు కూడా హడలిచచ్చేవారు. ఆఫీసు స్టాఫ్‌తో పాటు, జీవన్ కూడా ఆ మార్గంలో నడవడం అందర్నీ ఆశ్చర్యపరచేది. ఎవరినీ నిల్చోనిచ్చేవాడు కాదు, కూర్చోనిచ్చేవాడు కాదు. ఉద్ధండప్ప కనిపిస్తే చాలు- ఎక్కడ తగులుకుంటాడోనని ప్రక్కవీధిలో నుండి పారిపోయేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే జీవన్ తన ఆఫీస్ మేనేజరు అయినా- తల్లిచాటు పిల్లిలా మెలిగేవాడు. అందరికీ తెలిస్తే చులకన అయిపోతాననే భయంతో పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించేవాడు. ఇంతకీ ఉద్ధండప్ప చీరాల ప్రాంతంలో చరిత్ర సృష్టించిన పెద్ద ఎల్.ఐ.సి. ఏజెంటు. ఆయన జన్మవృత్తాంతాన్ని ఆ ప్రాంతవాసులు చాలా ఆసక్తిగా చెప్పుకుంటుంటే విని ఆశ్చర్యపోయేవాడు భైరవమూర్తి.

పవిత్ర కుందేరు నది ఒడ్డున గల చీరాల పట్టణంలో పద్దెనిమిది వందల తొంభైఆరో సంవత్సరంలో ఒక్కశాస్త్రి, పోతులమ్మ అనే పుణ్యదంపతులకు శ్రావణ బహుళ పాడ్యమి తిథినాడు మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటల ముప్పైనిమిషాలకు ఒక బాలుడు జన్మించాడు.

సాధారణంగా భూమిమీద పడ్డ ప్రతి శిశువు “అమ్మా! అమ్మా..!” అని ఏడుస్తూంటే- ఈ అసాధారణ బాలుడు “బీమా! బీమా..!” అని ఏడ్చేవాడు. ఆరోగ్యంగా, అందంగా, చూడ్డానికి ముద్దొచ్చే ఆ బాలుణ్ణి చూసి అందరూ అక్కున చేర్చుకొని ఆనందంతో మురిసిపోయారు. ఆ శిశువు జన్మించిన సమయంలో దివి నుండి దేవతలు హాహాకారాలు చేశారు.

ఒకరోజు పరమ పావని అయిన పోతులమ్మ ముద్దులొలికే ఆ శిశువుని చంకనేసుకొని గలగల పారే కుందేరు నదిలో జలకాలాటల కెళ్లింది. ఆ పసివాణ్ణి ఒడ్డున పడుకోబెట్టి, నదిలో స్నానం చేస్తుండగా ఒక నల్లని కోడెత్రాచు తన పడగతో ఆ బాలునికి నీడ పట్టసాగింది. సరిగ్గా అదే సమయానికి ఆ మార్గం గుండా వెళుతున్న ‘వాడరేవు’ ఆశ్రమాధిపతి స్వామి శివానందస్వామీజీ ఆ అపూర్వ దృశ్యాన్ని చూసి, “బీమా! బీమా..!” అంటూ ఆనందంగా కేరింతలు కొడుతున్న ఆ బాలుని తేజస్సును దివ్యదృష్టితో పరిశీలించి, “ఈ బాలుడు భవిష్యత్తులో పెరిగి పెద్దవాడై మంచి ఎల్.ఐ.సి. ఏజంటు అవుతాడు. ఇన్స్యూరెన్స్ రంగంలో ఈ ప్రాంతానికి అగ్రగామిగా నిలుస్తాడు” అని దీవించాడు. మంచి ఉద్ధండ పిండం అయి భవిష్యత్తును శాసిస్తాడని భావించి, ఆ చిన్నారిబాబును ‘ఉద్ధండప్ప’ అని నామకారణం చేసి తన దారిన తాను పోయాడు.

వాడరేవు ఆశ్రమాధిపతి శివానందస్వామీజీ మాటల్ని ఆలకించిన దేవతలు ఇక గత్యంతరం లేక చిట్టిఉద్ధండప్పపై పూలవాన కురిపించక తప్పలేదు. స్వామీజీ దీవెనలతో ఆ చిన్నారి దినదిన ప్రవర్ధమాన మవుతున్నాడు. ‘పూవు పుట్టగానే పరిమళించు’ నన్నట్లు- ముద్దులొలికే ఆ బాలుడు తేనెలూరు తన వచ్చీరాని మాటలతో చిన్నప్పటి నుండి ‘ఎండోమెంట్ పాలసీ, మనీబ్యాక్ పాలసీ, జీవన్‌మిత్ర, డబుల్ యాక్సిడెంట్ బెనిఫిట్ సమ్ ఎస్యూర్డ్, టేబుల్ అండ్ టరమ్’ అంటూ ఎల్.ఐ.సి. గురించి ముద్దుముద్దుగా మాట్లాడుతుంటే ఆ చుట్టుపక్కల ప్రజలు ఉద్ధండప్ప తెలివితేటలకు, బుద్ధికుశలతకు మెచ్చుకొని మురిసిపోయేవారు. ఇక ఒక్కశాస్త్రి, పోతులమ్మ దంపతులు తమ కలలరూపం ఉద్ధండప్ప మంచి ఎల్.ఐ.సి. ఏజెంటు అవ్వాలని, పాలసీల మీద పాలసీలు చేయడంలో అందరికన్నా పైన అందెవేసిన చేయి అయి ‘పాలసీల మారాజు’ కావాలని కలలు కనేవారు.

మొత్తానికి... నూనూగు మీసాల ఉద్ధండుడు పెరిగిపెద్దవాడై ‘కృషితో నాస్తి దుర్భిక్షం’ అన్న నానుడిని నిజం చేస్తూ ఒక ‘బెస్ట్ ఏజెంట్’గా ‘ఎల్.ఐ.సి.’కి తలమానికమైనాడు.

నూనూగు మీసాల ఉద్ధండప్ప పెరిగిపెద్దవాడై- 'బీమా' సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజులా ఏలుతూంటే... ఎందరో యువతులు ఆ రాజుకు 'రాణి' కావాలనే తలపుతో అతనిపై మనసు పారేసుకొనేవారు. అతని చూపుల కోసం, చిలిపిమాటల కోసం పరితపించేవారు.

'యాచకా యాచకోం శత్రుః' ...వృత్తిలోని వారికి ఆ వృత్తివారే కాంపిటేటర్సు! వారే పరోక్షంగా శత్రువు లవుతుంటారు. ఉద్ధండప్పకి ప్రధాన ప్రత్యర్థి కమ్ శత్రువు... తన సహఏజెంట్ 'జీవన మిత్ర.' మిత్ర తనదైన శైలిలో కస్టమర్స్‌ని కన్విన్స్ చేసి వ్యాపారంలో ఎదుగుతుంటే... తన బిజినెస్‌కి గండికొట్టే జీవన మిత్ర వేగానికి ఎలాగైనా అడ్డుకట్ట వేయాలని నడుం బిగించాడు.

వెంటనే అతని మహాబుర్రలో 'మహా ఆలోచన' తళుక్కుమంది. ఆమెనే పెళ్ళి చేసుకుంటే- ఇద్దరి పాలసీలు ఒకటీ ఒకటీ కలిసి రెండు అవుతుంది. విషయాన్ని తల్లిదండ్రులు పోతులమ్మ, ఒక్కశాస్త్రిలకు చెప్పేసరికి- 'కొడుక్కి తగిన కోడలు' దొరికినందుకు మురిసిపోయారు.

మిత్ర కూడా మిగతా ఆడవారిలా ఉద్ధండుడి చూపు కోసం, వలపు కోసం, చిలిపి మాట కోసం పరితపిస్తూండటంతో ఆ వైపు నుండి వెంటనే 'లైన్ క్లియర్' అయిపోయింది. ఏ గూటిపక్షులు ఆ గూటికే చేరతాయన్నట్లు- తను మెచ్చిన కోమలి 'జీవన మిత్ర'కు భర్త అయిపోయాడు.

హనీమూన్‌కి వెళ్లి మిత్రా,ఉద్ధండులు ప్రణయవిహారం చేస్తూంటే ప్రకృతి పులకించి వసంత సుగంధాలు వెదజల్లి వారిని ఆశీర్వదించింది. ఆడది మగాడితో ఏది కావాలని కోరుకుంటుందో అది పొందేసరికి- ఆడతనాన్ని మనస్ఫూర్తిగా సమర్పించుకోవడానికి మనసు ఉవ్విళ్ళూరుతుంది. నడిరేయి కోర్కెల రెక్కలు అలసి, తనువు తపన చల్లారినపుడు- తనలో గువ్వలా ఒదిగిపోయిన మిత్ర తల నిమురుతూ అన్నాడు-

"మిత్రా! నీ సహకారం ఉంటే నేను మరిన్ని పాలసీలు చేయించగలను. ఈ 'బీమా' సామ్రాజ్యానికి మనం రారాజులం కావాలని నా ఆశ!"

"అలాగే! 'జగదేకవీరుని కథ' సినిమాలో రేలంగి, గిరిజల్లా మీరు 'రెండు చింతల' మహారాజు, నేను 'ఏకాశ' మహారాణిని! ఏజెంట్‌గా ఇంకా ఎదగాలనీ, నన్ను పెళ్ళి చేసుకోవాలనే రెండు చింతలు మీవి! మిమ్మల్ని వివాహం చేసుకొని మీకు సహాయపడాలనే ఏకాశ నాది! నిజానికి ఈ చిలిపి ఉద్ధండుణ్ణి పెళ్ళి చేసుకోవాలనే ధ్యేయంతోనే నేను ఎల్.ఐ.సి. ఏజెన్సీ తీసుకున్నది!" అసలు విషయం భార్య బయటపెట్టేసరికి- అతడు ఆనందంతో తబ్బిబ్బయిపోయాడు.

మిత్రా, ఉద్ధండుల దాంపత్యం 'మనీబ్యాక్ పాలసీ'లా కలిసొచ్చింది. వారి కలల పంట అయిన అబ్బాయికి 'జీవన్ కిషోర్' అని, అమ్మాయికి 'జీవన్ స్నేహ' అని ముద్దుగా పేర్లుపెట్టుకున్నారు.

• • •

ఉద్ధండప్ప చేతితనమో, లేక నోటితనమో తెలియదుగాని- అతని నోటినుండి ఏదైనా మాట వస్తే అది జరిగితీరేది. అందుచేత ప్రతివారూ అతనికి ఎదురుచెప్పడానికి వెనుకంజ వేసేవారు.

జీవన్ తను పనిచేస్తూన్న ఎల్.ఐ.సి.బ్రాంచిలో బ్రాంచిమేనేజరు స్థాయికి ఎదగడంతో ఉద్ధండప్ప సర్కిల్ కూడా పెరిగింది. కొడుకు ఆఫీసులోని స్టాఫ్‌ని పాలసీల కోసం పీడించడం మొదలుపెట్టేవాడు. ఇక బయటవాళ్ళ సంగతి సరేసరి! తనకు సహకరించకపోతే ఇంక్రిమెంట్ కట్ చేయిస్తాననీ, మరో ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయిస్తాననీ భయపెట్టేవాడు. ఈ బీమా రాక్షసుడి ధాటికి తట్టుకోలేక అక్కడివారంతా శ్రీలంక శరణార్థుల్లాగ విలవిలలాడిపోయారు.

"నా వల్ల కాదు... ఈసారికి నన్ను వదిలేయండి! ఇప్పటికే మీకు అరడజను పాలసీలు ఇచ్చి ఉన్నాను" గుమాస్తా భైరవమూర్తి అనేసరికి-

"అదేమిటోయ్ భైరవా! యువకుడివి, ఉత్సాహవంతుడివి, జీవితంలో పైకి రావలసినవాడివి. నీవే ఇలా వెనుకంజ వేస్తే ఎలా? ఎప్పుడూ క్విక్‌డెషిషన్స్ తీసుకొని ముందుకు సాగిపోతూఉండాలి."

"అదికాదండీ... జీతం సొమ్ములు అన్నీ మీకే ఇచ్చేసి ఇక పార్ట్‌టైమ్ మీ ఇంట్లో పాలేరుగా చేరాలి!" ఒకింత భయపడుతూ చెప్పేసరికి-

"అలా అనకు భైరవా... అంతా నీ మంచికే చెబుతున్నానయ్యా! ఉదాహరణకు నీకు ఏ కేన్సరో వచ్చిందనుకో- నిన్ను ఆదుకొనేందుకు 'ఆశాదీప్' పాలసీ ఉంది. యాక్సిడెంట్ అయి ఏ చెయ్యో, కాలో పోయిందనుకో- 'ఎండోమెంట్ పాలసీ' నీకు అండగా ఉంటుంది. నువ్వు కాని, నీ భార్య కానీ ఎవరో ఒకరు అనుకోకుండా ఎగిరిపోయారనుకో- 'జీవన్‌సాథీ' వెన్నంటి ఉంటుంది."

ఉద్ధండప్ప మాటలు విని ఒళ్ళంతా చెమటలు పట్టాయి భైరవమూర్తికి. అసలే అతనిది నీచమైన నోరు... ఏది అంటే అది జరిగితీరుతుందని ప్రతీతి! 'కేన్సర్' అంటే వచ్చి తీరుతుంది. 'యాక్సిడెంట్ అయి కాలో, చెయ్యో పోవచ్చు!' అంటే తప్పనిసరిగా అమలు అవుతుంది. భార్యాభర్తల్లో ఎవరో ఒకరు పోతారంటే- నల్లరాయిలా ఉన్నా రక్కున పోయి తీరాల్సిందే!

ఒక్కసారి సినిమాల్లో 'ఐరన్‌లెగ్ శాస్త్రి' గుర్తుకువచ్చాడు. కానీ, తేడా ఒక్కటే... ఆ శాస్త్రి లెగ్‌కి ఎంత పవరుందో- ఈ ఉద్ధండ శాస్త్రి నోటికి అంతకన్నా ఎక్కువ శక్తి ఉంది. మొన్నటికి మొన్న ఒకాయన ఈయన ధాటికి తట్టుకోలేక కొత్తపాలసీ కోసం 'బ్యాంక్ చెక్' ఇచ్చి, వెంటనే బ్యాంకులో 'స్టాప్ పేమెంటు'కి లెటరు ఇచ్చాడు. వెంటనే ఇచ్చిన ఈయనకి పేమెంట్ ఆపిన బ్యాంక్ క్లర్క్‌కి కీడు జరిగిందట! అందుకే 'ఉద్ధండప్పా! మజాకా!!' అనుకొని అంతా చాలా జాగ్రత్తగా ఉంటారు. దానికితోడు జీవన్ కూడా తండ్రికి భయపడి తెలిసున్నవారినందరినీ ఎల్.ఐ.సి. చేసి తమని రక్షించమని బ్రతిమాలుతూ ఉంటాడు. మొత్తానికి భైరవమూర్తికి వలలో పడి గిలగిలలాడక తప్పలేదు. తనలాంటి ఉద్ధండ బాధితులు ఎందరో?! వారినందరినీ తలచుకొని మనసులో బాధపడటం తప్ప ఇంకేమీ చేయలేకపోయాడు భైరవమూర్తి.

ఒకసారి చీరాలలో జరిగిన పెళ్ళిలో- పెళ్ళికి వచ్చిన వారినందరినీ కూర్చోబెట్టి భవిష్యత్తు గుర్తుచేసి జీవితం మీద భయాన్ని కలుగజేశాడు. తరువాత పెళ్ళివారందరికీ పాలసీలు అంటగట్టాడు. దాంతో- వారి ఆనందమంతా ఆవిరై, జీవితంలో ఏదో కోల్పోయినవారిలా నిరాశతో వెనుదిరిగారు. ఫలితంగా 'ఆ ఊరి అమ్మాయి' అన్న భయంతో పెళ్ళికూతుర్ని కాపురానికి తీసుకెళితే ఒట్టు!

జీవన్‌వాళ్ళ రీజినల్ మేనేజర్ ఒకసారి విజిట్‌కి వస్తే... అయనకు లంచ్ ఆఫర్ చేశాడు. ఆయన్ని కూడా ఉద్ధండప్ప పాలసీ అడిగేసరికి ఈసారి ఆశ్చర్యపోవడం ఆయన వంతు అయింది.

"సాధారణంగా మేము పాలసీదారుల నుండి ఒక్కపైసా కూడా వదలకుండా ప్రీమియమ్స్‌ని వసూలు చేస్తూ ఉంటాము. అది మా వృత్తిధర్మం! అలాగే మీరు కూడా ఆడా-మగా, చిన్నా-పెద్దా, బీదా-గొప్పా అనే తారతమ్యాలు లేకుండా అందర్నీ పీడించి బిజినెస్ చేస్తున్నందుకు మిమ్మల్ని మనసారా అభినందిస్తున్నాను. రీజనల్ మేనేజర్ అయిన నన్ను కూడా వదలకుండా పట్టుకున్నందుకు హ్యాట్సాఫ్! మీ ఐరన్‌మౌత్ గురించి కూడా విన్నాను. మనసారా అభినందిస్తున్నాను. మీలాగా అందరూ కృషి చేస్తే ఈ జగత్తు 'బీమామయం' కాగలదు. మీరు ఏజంట్, మీ భార్య ఏజెంట్, మీ

అబ్బాయి ఈ బ్రాంచికి మేనేజరు! ఇండియా మొత్తంమీద ఎక్కడా కనపడని 'భిన్నత్వంలో ఏకత్వం' నినాదాన్ని మీ ఇంట్లో చూస్తున్నాను. ఈ ఇల్లు ఓ 'బీమా నివాస్.' మీ కృషిని మెచ్చి మిమ్మల్ని 'బీమా భయంకర' అనకుండా ఉండలేకపోతున్నాను. మీ సేవలు మాకు ఎంతో అవసరం. దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి!" కాంప్లిమెంట్స్‌తో పాటు పాలసీ ఇచ్చి వెళ్లిపోయాడు.

చివరికి ఉద్ధండప్ప పట్ల విసిగి ఆ ప్రాంత ప్రజలు చేస్తున్న హాహాకారాల ఫలితంగా... జీవన్ మరో బ్రాంచికి ట్రాన్స్‌ఫరు అయి వెళ్లిపోయాడు. కొడుకుతో పాటు ఉద్ధండప్ప కూడా వెళ్లక తప్పలేదు.

• • •

వాస్తవంలోకి వచ్చిన భైరవమూర్తి చిన్నగా నవ్వుకున్నాడు...

'పూర్ ఉద్ధండప్ప! అతని కృషి అందిరకి కొంచెం 'అతి'గా అనిపించినా- ఆరోజుల్లో ప్రతివారికీ 'పొదుపు'ను అలవాటు చేశాడు. 'ఐరన్ మౌత్' అనే ముసుగులో ఆనాడు అందరిచేతా పాలసీలు చేయిస్తే- ఈనాడు వాటి తాలూకు రిటర్న్స్ తీసుకొని వాటిని అందరూ ఆనందంగా అనుభవిస్తున్నారు. ఆయన చేయించిన ఏడుపాలసీల సొమ్ము ఈనాడు తమ అబ్బాయి ఇంజనీరింగ్‌కి, అమ్మాయి పెళ్ళికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆనాడు ఆయన మాట విని ఉండకపోతే ఈనాడు తనకు 'చదువులు, పెళ్ళిళ్లు' అనేవి తలకు మించిన భారమయ్యేవి.'

– భైరవమూర్తి మనసులో ఉద్ధండప్పకి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు. జీవన్‌తో పాటు మరో ఊరికి షిఫ్టు అయిన ఆయన- తరువాతి కాలంలో అక్కడ ఉండలేక చీరాలలోనే సెటిల్ అయినాడట! ఎందుకో భైరవమూర్తికి ఆయనను చూడాలనిపించింది.

'చాగంటి ఉద్ధండప్ప- చాగంటి జీవన్ మిత్ర, ఎల్.ఐ.సి. ఏజెంట్స్' అనే బోర్డు సాదరంగా ఆహ్వానిస్తూంటే గేటు తీసుకొని లోపలికి ప్రవేశించాడు.

తొంభై ఐదేళ్ల వయసులో వార్ధక్యం శరీరాన్ని బాగా కృంగదీస్తూంటే... మందగించిన చూపుతో భైరవమూర్తిని గుర్తుపట్టాడాయన. తెచ్చిన యాపిల్స్, ద్రాక్షపళ్ళు ఆయన చేతిలో పెట్టి-

"ఉద్ధండప్పగారూ... బాగున్నారా? జీవన్ ఎక్కడ ఉన్నాడు?" అని అడిగాడు.

వణుకుతున్న స్వరంతో చెప్పాడు- "విశాఖపట్నం బ్రాంచిలో ఉన్నాడయ్యా!"

కాసేపు ఇద్దరూ అప్పటిరోజుల అనుభవాల్ని పంచుకున్నారు. "అక్కినేని నాగేశ్వరరావు తుదిశ్వాస విడిచేవరకూ నటిస్తూనే ఉంటాడట! అలాగే నేను కూడా చివరివరకు ఎల్.ఐ.సి. చేయించాలని కోరిక!"

"సంతోషం ఇకనె[illegible]స్తాను. ఈ వయసులో అవన్నీ వదిలేసి కృష్ణా రామా అంటూ కాలక్షేపం చెయ్యండి" భైరవ[illegible] లేచాడు.

"మంచిదయ్యా! వెళ్లేముందు [illegible] ఎక్స్‌క్లూసివ్ పాలసీ ఫర్ ఎక్స్‌క్లూసి[illegible] పీపుల్- జీవన్‌శ్రీ కొత్తపాలసీ! ఎలాగూ చూడ్డానికి వచ్చావు కదా! ఓ పాలసీ రాసి పోండి!" అంటూ తలగడ క్రింద నుండి బ్రోచర్, ప్రపోజల్ ఫారంలు తీసి, మాట బయటకు రాకపోతున్నా అతికష్టం మీద పాలసీ ఫ్యూచర్స్‌ని వివరిస్తూన్న ఉద్ధండప్పని చూసి అవాక్కయిపోయాడు భైరవమూర్తి.